ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

పెద్దపల్లి

5★ జిల్లా వార్తలు

ఆదివారం 3 నవంబరు 2024

న్యూస్ బాక్స్

ఉత్సవాలకు సన్నాహాలు

కోల్‌సిటీటౌన్,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా ఆలిండియా అంబేద్కర్‌యువజన సంఘం జిల్లా కమిటీ ఉత్సవాలకు సన్నాహాలు చేస్తోంది. ఈనెల 26 నుంచి డిసెంబర్ 6వ తేది డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి వరకు రాజ్యాంగ అమలు దశ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, పెద్దపల్లి జిల్లా కన్వీనర్ మాజీ జెడ్‌పీటీసీ లంక సదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 14 మండలాలతో పాటు మూడు మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాజ్యాంగం అమలు దినోత్సవంలో కుల, మతాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని వారుకోరారు.

అచ్చు తప్పును సరిచేయాలి

పెద్దపల్లిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) కుల ఫార్మాట్ 140 సంఖ్యలో నేతకానికి బదులుగా నిత్కాని అని అచ్చు తప్పుగా ప్రచురించమైందని, దానిని సరి చేయాలని నేతకాని కుల సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ దుర్గం నర్సయ్య, జిల్లా అధ్యక్షుడు గొల్లె రాజ్ కుమార్ అధికారులను కోరారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నేతకానికి బదులు నిత్కాని అని సర్టిఫికెట్స్ వచ్చాయన్నారు. కుల గణన జరుగుతున్నందున అచ్చు తప్పును సరిచేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో మని రాజయ్య, మంచినీళ్ల లింగయ్య పేగ శ్రీనివాస్, ముడిమడుగుల రాజేష్, మా దాసు సుధాకర్, దూట రాజు, జాడి తిరుపతి, మంచినీళ్ల శివలింగయ్య, భౌతు గంగా జలం, మాదాసు ప్రశాంత్, మాదాసు మధు సూదన్, గోళ్లే రాజయ్య మాదాసు పవన్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైదంబండకు చెందిన బియ్యన అజయ్ ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శనివారం పరామర్శించారు. ఆయన వెంట కిషన్‌రెడ్డి, రాజిరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తొలగనున్న ఇబ్బందులు

- మెస్‌చార్జీల పెంపుతో విద్యార్థుల్లో ఆనందం
- గత ప్రభుత్వంలో 25 శాతం పెంపు.. కాగితాలకే పరిమితం..
- ప్రస్తుతం 40 శాతం పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో 10 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ఎట్టకేలకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థుల ఇబ్బందులు తొలగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలను నలభై శాతం వరకు, కాస్మెటిక్ చార్జీలను 3.12 రెట్లు పెంచడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెరగక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం చార్జీలను పెంచుతూ శుక్ర వారం జీవో 9ని విడుదల చేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకుంటున్నారు. దీంతో జిల్లాలో 10వేల మంది విద్యా ర్థులకు లబ్ధి చేకూరనుండగా, ఇక నుంచి విద్యార్థులకు పౌష్టికాహారం లభించ నున్నది. జిల్లాలో సాంఘిక సంక్షేమ గురు కులాల సొసైటీ ఆధ్వర్యంలో 6 గురుకులాలు, ఒక మినీ గురుకుల పాఠశాల నడుస్తున్నది. వీటిలో దాదాపు 5,600 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులాలు 7 నడుస్తుం డగా, వీటిలో 3,080 మంది విద్యార్థులు చదువుతు న్నారు. మైనార్టీ గురుకుల విద్యాలయాలు 4 ఉండగా, వీటిలో 1054 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలంగాణ రెసిడెన్షియల్ స్కూళ్లు రెండు ఉండగా వాటిలో 680 మంది చదువుతున్నారు. ఇవేగాకుండా ఎస్సీ బాల, బాలికల హాస్టళ్లు 11 ఉండగా, వీటిలో 630 మంది వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. కళాశాల వసతి గృహాలు ఆరు నడుస్తుండగా, వీటిలో 520 మంది వరకు విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తు న్నారు. బీసీ వసతి గృహాలు 6 ఉండగా వీటిలో 439 మంది విద్యార్థులు, కళాశాల స్థాయి వసతిగృహాలు 8 ఉండగా 770 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 3 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు నెలకు 950 రూపాయలు ఇస్తుండగా, ప్రస్తుతం 1330 రూపాయలకు పెంచారు. 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు 1100 నుంచి 1540 రూపాయలకు పెంచారు. ఇంటర్ నుంచి పీజీ చదివే విద్యార్థులకు 1500 నుంచి 2100 రూపాయలకు పెంచారు. కాస్మెటిక్ చార్జీలను 3.12 రెట్లు పెంచారు. దీంతో పెరిగిన చార్జీలతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది.

● ఐదేళ్లుగా ఇబ్బందులు పడ్డ విద్యార్థులు..

వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెరగక ఐదేళ్లుగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో పెంచిన మెస్ చార్జీలు ఇప్పటి వరకు అమల్లో ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో నిత్యావసర వస్తువులు, కూరగాయలు, కిరాణ సరుకులు రెండు, మూడింతలు

మిగతా 8వ పేజీలో...

రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



ఆసుపత్రిలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీహర్ష

మంథని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అకాల వర్షాలతో ధాన్యం తడిసి రైతులు ఎక్కడా నష్టపోకుండా కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. శనివారం స్థానిక ఏఎంసీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, 4వ వార్డులో ఇంటింటి సర్వేను పరిశీలించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిని, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే కోసం హౌజ్ లిస్టింగ్ పక్కాగా చేపట్టాలన్నారు. వేరే బృందాలు సైతం సర్వే చేయాల్సి వచ్చినా ఎలాంటి ఇబ్బందులు రాకుండా మ్యాపింగ్ ఉండాలని సూచించారు. ఒక ఇంట్లో రెండు కుటుంబాలు ఉంటే వేర్వేరుగా సర్వేలో వివరాలు సేకరించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మేరకు టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. స్థానిక మాతా శిశు ఆరోగ్య కేంద్రం కాంపౌండ్ వాల్ నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్‌కు సబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం వార్డులను, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట మంథని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

సమాధుల తోటలో ఎమ్మెల్యే నివాళులు



సమాధుల తోటలో క్యాండిల్ వెలిగిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవుల సమస్త ఆత్మల దినం సందర్భంగా శనివారం రాత్రి గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని క్రైస్తవ సమాధుల తోటలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించారు. పాస్టర్ జాకబ్‌తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల విన్నపం మేరకు సమాధుల తోట సుందరీకరణకు తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్రైస్తవ కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

బాలుడికి మెరుగైన వైద్యం అందించండి

కళ్యాణ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో గాయపడి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సయ్యద్ హైమాన్‌ను, కుటుంబాన్ని శనివారం రాత్రి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడి ఆరోగ్య పరిస్థితి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు చెప్పారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జాడలేని పశువైద్య సిబ్బంది

- ఇబ్బందులు పడుతున్నరైతులు



ఈసాలతక్కళ్లపల్లిలోని పశువైద్యశాల

పాలకుర్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలోని పశువైద్యశాలలో వైద్యాధికారి, సిబ్బంది అందుబాటులో లేక పశుపోషకులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రానికి అందుబాటులో ఉన్న ఈ పశువుల ఆసుపత్రికి డాక్టర్ సమయానికి రాకపోవడంతో రైతులు తమ పశువులతో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడ పనిచేసిన డాక్టర్ 6 నెలల క్రితం ఇతర ప్రాంతానికి బదిలీ కావడంతో, పర్మినెంటు డాక్టర్‌ను నియమించకుండా అంతర్గాం, రామగుండం, గోదావరిఖని తదితర ప్రాంత్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పడంతో ఆయన ఏ రోజు ఎక్కడ ఉంటాడో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పర్మినెంటు డాక్టర్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్

కళ్యాణ్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో అధికార ంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని నెరవేర్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని గంగానగర్‌లో సీపీఎం పట్టణ రెండవ మహాభలను సీపీఎం సీనియర్ నాయకులు నరివిట్ల నరసయ్య జెండావిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన భూపాల్ మాట్లాడుతూ గోదావరిఖనిలో గత కొన్ని నెలలుగా ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు వేసుకొని ఉంటున్న వారికి తక్షణమే పట్టాలివ్వాలన్నారు. అదేవిధంగా ఈ ప్రాంత అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం ఎస్‌టీపీ ఏర్పాటులో భాగంగా గంగానగర్‌లో తొలగించిన ఇళ్ళ వారికి ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంటనే వారికి స్థలాలు ఇచ్చి పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఏవీ కూడా అమలు కాలేదని విమర్శించారు. వెంటనే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలన్నారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య రాష్ట్రంలో తీవ్రంగా ఉందన్నారు. ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని ఇప్పటివరకు పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే ఆదిశగా కృషి చేయాలని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. తెలంగాణలోని బొగ్గుబ్లాకులను ప్రైవేట్ పరం చేయకుండా సింగరేణి సంస్థకే అప్పగించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులందరిని రెగ్యులైరేజేషన్ చేయాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఉద్యోగులకు సొంతిల్లు అమలుచేయాలని, కార్మిక కాలనీల్లో మంచినీటి సౌకర్యం, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతి సింగరేణి ఉద్యోగస్తుల కుటుంబానికి 250 గజాల స్థలం కేటాయించి 30లక్షల వడ్డీ లేని రుణం సింగరేణి యాజమాన్యం ఇవ్వాలన్నారు. భవిష్యత్‌లో గోదావరిఖని ప్రాంతంలో ప్రజల సమస్య పరిష్కారానికి సీపీఎం పార్టీ ముందుండి పోరాడుతుందని తెలిపారు. అందులో ప్రజలందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ సభలో యాకయ్య, ముత్యంరావు, మహేశ్వరి, ఎం.రామాచారి, వేల్పుల కుమారస్వామి, మెండె శ్రీనివాస్, మేదరి సారయ్య, వడ్లకొండ నాగమణి, ఉపేందర్, జన్నె కొమురయ్య, భాగ్యలక్ష్మి, సాగర్, రాజమౌళి, తోట నరహరిరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీడీనగర్ ప్రాంతంలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ శనివారం తెలిపారు. ఈనెల 4న కరీంనగర్ జిల్లాలో జరగనున్న ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు అండర్ 14విభాగంలో బి సాయి అక్షయ్(లాంగ్ జంప్) 400 మీటర్ల రన్నింగ్, అండర్ 17 ఇ అరవింద్ (100మీటర్ల రన్నింగ్)లో ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్, పీఈటీ సంతోష్ ఎంపికైన విద్యార్థులను శనివారం అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు నిట్టూరు విద్యార్థి ఎంపిక

పెద్దపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని జగిత్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్ 14 ఖోఖో క్రీడల్లో రాష్ట్రస్థాయికి నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని అట్ల సాత్విక ఎంపిక అయ్యింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఖోఖోలో క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ఎంపిక కావడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 3,4 తేదీల్లో కామారెడ్డి జిల్లా పోసానిపేట్ గ్రామంలో ఉన్నత పాఠశాల మైదానంలో జరిగే రాష్ట్రస్థాయిలో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అధికారులు

పెద్దపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన హైదరాబాద్ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్ఠాత్మకమని, ఏ చిన్న ఇబ్బంది లేకుండా సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. ప్రభుత్వం కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పట్టిందని అన్నారు. సన్న రకం ధాన్యం సాగు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాల్ 500 రూపాయల బోనస్ ప్రకటించిందని తెలిపారు. జిల్లాలో రూపొందించుకున్న ప్రణాళికల ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన ప్యాడీ క్లీనర్, ఇతర సామగ్రి వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్ల వద్ద తాలు పేరుతో ఎటువంటి ధాన్యం కోతలు జరగవద్దని, కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత ప్రమాణాలు పరిశీలించిన తర్వాత కొనుగోలు చేయాలని, రైతుకు ఎటువంటి నష్టం రావడానికి వీలులేదని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని మంత్రి సూచించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయింపు కోసం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసిందని, వీటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని, జీవో 27పై చర్చించాలని, రైస్ మిల్లర్లచే బ్యాంక్ గ్యారంటీ సమర్పిస్తామని అండర్ టేకింగ్ తీసుకుని ధాన్యం కేటాయింపు చేయవచ్చని అన్నారు. రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ సమర్పించని పక్షంలో జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం భద్రపరిచేందుకు అవసరమైన మేర గోడౌన్ సన్నద్ధం చేయాలని, ప్రతి జిల్లాలో ధాన్యం కొనుగోలు ఫోన్ నెంబర్‌తో కూడిన గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా 48 గంటల్లో చెల్లింపులు పూర్తయ్యేలా చూడాలన్నారు. పక్క రాష్ట్రాల ధాన్యం మన కొనుగోలు కేంద్రాలకు రాకుండా బార్డర్ల వద్ద చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ వేణు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో అలమటిస్తూ..

- శ్మశానంలో పక్షుల కోసం పెట్టిన ఆహార పదార్థాలు తిన్న వ్యక్తి

సుల్తానాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆకలితో అలమటిస్తున్న ఓ వ్యక్తి.. శ్మశానంలో విస్తరిలో కనిపించిన ఆహార పదార్థాలను తిన్నాడు. దీంతో అక్కడే పక్షి కోసం ఎదురు చూస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఈ పరిణామాన్ని చూసి విస్తుపోయారు. సుల్తానాబాద్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల మృతిచెందాడు. శనివారం ఐదో రోజు కావడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఉదయం స్థానిక గట్టేపల్లి రోడ్డులోని శ్మశాన వాటికలో పలు రకాల ఆహార పదార్థాలను విస్తరిలో పెట్టి పక్షుల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే అక్కడే ఉన్న ఓ వ్యక్తి వచ్చి వాటిని తినడంతో అందరూ ఆశ్చర్యపోయారు.

అయితే విస్తరి ముందు కూర్చుని తింటున్న వ్యక్తిని పొమ్మనలేక పోయారు. విషయం ఆరా తీస్తే.. సదరు వ్యక్తి ఆకలితో అలమటిస్తూ శ్మశానం చుట్టూ తిరుగుతుండగా పక్షుల కోసం పెట్టిన భోజనం కనిపించడంతో కడుపునిండా తినివెళ్లాడు.

రెడ్డి సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ముకుందరెడ్డి

గోదావరిఖని, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్య వేదిక జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన కంకణాల ముకుందరెడ్డి నియామితులయ్యారు. ఈ మేరకు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ముకుందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు మణిదీప్ ఎంపిక


మణిదీప్‌ను అభినందిస్తున్న హెచ్ఎం

మెట్‌పల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి మణిదీప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జితేందర్ శనివారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి అండర్ 14 కరాటే పోటీలో మణిదీప్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడని తెలిపారు. అండర్-20 ఖోఖో పోటీల్లో కాశవేని దేవిశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

యువతిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

కరీంనగర్ క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని చెప్పి మోసం చేయడంతోపాటు దాడి చేసి ఇబ్బందులకు గురిచేసిన ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. వన్‌టౌన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని గోదాంగడ్డకు చెం దిన రమేష్, ఒక యువతి సహజీవనం చేశారు. వారి మధ్య విభేదాలు రావడంతో విడిగా ఉంటున్నారు. ఇటీవల రమేష్ ఆ యువతితో గొడవ పడి దాడి చేశాడు. యువతి ఫిర్యాదు చేయడంతో అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సేవా గుణం.. స్ఫూర్తిదాయకం

ఆదర్శవంతమైన జీవితాన్ని గడుపుతూ స్ఫూర్తినిచ్చేవారు అరుదుగా కనిపిస్తారు. తమ ప్రాంతానికి సేవ చేస్తూ పలువురికి స్ఫూర్తిగా నిలిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చింతోజు భాస్కర్ మానేరు సంస్థల ద్వారా ఆ జిల్లాలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం నంచర్ల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి తమ ప్రాంతంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మోటారు మెకానిక్ నుంచి సేవా రంగంలోకి..

- మానేరు సంస్థ ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చింతోజు భాస్కర్

సిరిసిల్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన చింతోజు భాస్కర్‌ను పేదరికం చిన్ననాడే పనివైపు పరుగులు పెట్టించింది. సిరిసిల్లలో మోటారు మెకానిక్‌గా గుర్తింపు తెచ్చుకున్న భాస్కర్ డీలర్‌గా వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు.



అబ్దుల్ కలాం అవార్డును అందుకుంటున్న భాస్కర్


చింతోజు భాస్కర్

ఆర్థికంగా ఎదుగుతూ మరికొందరికి ఉపాధి కల్పిస్తూనే స్వచ్ఛంద సేవలో తనదైన ముద్ర వేసుకున్నారు. మానేరు స్వచ్ఛంద సంస్థను స్థాపించి సేవా కార్యాక్రమాలను విస్తరించారు. జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. లాక్‌డౌన్ వంటి విపత్కర పరిస్థితుల్లో అన్నదానం, నిత్యావసర సరుకుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. సిరిసిల్లలో కార్మికుల వరుస ఆత్మహత్యల నివారణ కోసం మనోధైర్య శిబిరాలను నిర్వహించారు. పలు అవార్డులు, పురస్కారాలను పొందారు. లోక్ అదాలత్ సభ్యుడిగా, ప్రభుత్వ పరంగా పలు కమిటీల్లోనూ పని చేస్తున్నారు. సినీనటుడు సంపూర్ణేష్‌బాబుతో కలిసి కొబ్బరిమట్ట, బజారురౌడీ తదితర సినిమాల్లో నటించారు. పలు సినీ ప్రముఖులతో టీవీ షోల్లో పాల్గొన్నారు. న్యాయ సేవలను పొందడానికి ప్రజల్లో అవగాహనను పెంపొందించే దిశగా సినిమాను రూపొందిస్తున్నారు

పూర్వ విద్యార్థులు కలిసి.. ట్రస్ట్‌గా ఏర్పడి

- సేవలు అందిస్తున్న శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్

పెగడపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సేవ చేయాలనే గుణం ఉంటే లక్షాధికారులో, కోటీశ్వరులో కానక్కరలేదు.. మంచి మనసుండి చేయాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు నంచర్ల శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు. పెగడపల్లి మండలంలోని నంచర్ల కేంద్రంగా నంచర్ల, రాములపల్లి, దీకొండ గ్రామాలకు చెందిన నంచర్ల పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 మంది కలిసి 2018లో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా తమ గ్రామాల్లో సేవలు అందజేసి ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా విస్తరింపజేశారు. ఆపద సమయంలో ఆస్పత్రికి వెళ్లేందుకు ఆరు లక్షలు వెచ్చించి అంబులెన్స్ ఏర్పాటు చేశారు. దాత ఒకరు వైకుంటరథం ఇస్తే ట్రస్ట్ తరుపున డ్రైవరు, డీజిల్ ఖర్చులు చెల్లిస్తున్నారు. మూడు గ్రామాల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి వార్తా పత్రికలతోపాటు యువతకు అవసరమయ్యే పుస్తకాల అందుబాటులో ఉంచుతున్నారు. ఇలా పలు సేవలు చేస్తున్నారు.


క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలుడి వైద్యానికి రూ. 75 వేలు ఆర్థిక సాయమందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అందరి సహకారంతో సేవా కార్యక్రమాలు

- చేపూరి మల్లేశగౌడ్, మేనేజింగ్ ట్రస్టీ



మాతృభూమికి కొంతైనా చేయాలన్న సంకల్పంతో శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించాం. ట్రస్టు సభ్యులే కాకుండా దాతలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు సహకారంతో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మూడు గ్రామాలకే కాకుండా మండలం, చుట్టు పక్కల గ్రామాలకు కూడా ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అందిస్తున్నాం.

దాతల సహకారంతో మరిన్ని సేవలకు కృషి

- లింగంపల్లి లచ్చయ్య, కోశాధికారి



నంచర్ల పాఠశాలలో చదువుకున్న మేము పాఠశాలకు, గ్రామానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ట్రస్ట్ ప్రారంభించాం. విద్యా, వైద్యం, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మరిన్ని సేవలు అందించాలనే దిశగా ముందుకు సాగుతున్నాం.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం

భగత్‌నగర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కొత్తపల్లి విద్యార్థులు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లాలో అక్టోబరు 28 నుంచి 30 వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17లో 81 కేజీల విభాగంలో బి అభిలాష్ రజత పతకం, అండర్-14లో 23 కేజీల విభాగంలో ఎం లహరి రజత పతకం కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎం పికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు వెంకటపద్మాదేవి, పీడీ ఎల్ వెంకటరమణ, కొత్తపల్లి మున్సిపల్ ఛైర్మన్ రుద్ర రాజు అభినందించారు.

అంతర్‌జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపిక


ఎంపికైన 'ఆదర్శ' విద్యార్థులు

గొల్లపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ మినీ స్టేడియంలో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ పోటీల్లో గొల్లపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారు. ఎస్‌జీఎఫ్ ఇంటర్నెట్ చెస్ పోటీల్లో జిల్లా స్థాయి పోటిల్లో ప్రతిభను కనబర్చి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదర్శ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న దేవి శ్రీహర్షిణి, ఎనిమిదవ తరగతి చదువుతున్న దేవి మహర్షి హశ్విత్ అనే ఇద్దరు విద్యార్థులు చెస్ పోటీల్లో జిల్లా స్థాయిలో మెరిసి అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరు సొంత అక్కాతమ్ముడు కావడం విశేషం. అంతర్‌జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన అక్కాతమ్ముడిని ప్రిన్సిపాల్ సుంకరి రవి, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, పీడీ రజిత, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఉద్యోగులకు త్వరలో యోగా శిక్షణ

- కలెక్టర్ పమేలా సత్పతి
- ఉత్సాహంగా జిల్లా స్థాయి యోగా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 2 (ఆంధ్రజ్యో తి): జిల్లాలోని ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా యోగా శిక్షణను నూతన సంవత్సరం నుంచి నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. శనివారం జిల్లా యువజన, క్రీడాశాఖ, యోగా అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లాస్థాయి ఆహ్వానిత యోగాసన పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ తనకు యోగా అంటే చాలా ఇష్టమన్నారు. అవకాశం ఉంటే క్రీడాకారిణి గా, కనీసం జట్టుకు మేనేజర్‌గానైనా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనాలని ఉందన్నారు. పాఠ శాలలు, ఇళ్లలో పిల్లలు కేవలం ధ్యానానికే పరిమి తం కాకూడదని, యోగాతో ప్రతిభను సొంతం చేసుకోవాలన్నారు. చిన్నారులు ప్రదర్శించిన యోగాసనాలు చూస్తే గర్వంగా ఉందన్నారు. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన దీపక్‌కు స్వర్ణ పతకం సాధించడం అభినందనీయమన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నవ్వడం కూడా యోగా లో ఒక భాగమని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ కరోనా సమయంలో యోగా చేయడం వలన చాలామం ది ఆరోగ్యాన్ని పరిరక్షించుకున్నారని అన్నారు. జిల్లా యోగా అసోసియేష న్ అధ్యక్షుడు సర్దార్ రవీందర్‌సింగ్ మాట్లాడు తూ జిల్లాలో యోగా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్వర్ణ పతక విజేత దీపక్‌ను, కోచ్ రామకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి సుధాకర్, జిల్లా క్రీడలు యువజన అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అనిల్ కుమార్ నెహ్రు యువ కేంద్రం కో-ఆర్డినేటర్ రాంబాబు, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి జనార్దన్‌రెడ్డి, తహసిల్దార్ కాళీచరణ్‌గౌడ్, జిల్లా ఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్య క్షుడు హర్మిందర్‌సింగ్, కోచ్‌లు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మం ది క్రీడాకారులు వివిధ వయ స్సు విభాగాల్లో పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ఆహూతు లను ఆకట్టుకున్నా యి. అనంతరం విజేతలకు కలెక్టర్ జ్ఞాపికతో పాటు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



యోగాసన పోటీలను తిలకిస్తున్న కలెక్టర్, అతిథులు, యోగాసనం వేస్తున్న కలెక్టర్ తల్లి ప్రవమయి ఆచార్య


యోగాసనాలు వేస్తున్న బాలికలు

- యోగాసనాలు వేసిన కలెక్టర్ తల్లి

కలెక్టర్ మాతృమూర్తి ప్రవమయి ఆచార్య యోగాపై ఉన్న మక్కువతో పోటీలో పాల్గొని రజత పతకాన్ని సాధించింది. అనంతరం తన కూతురు, కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా జ్ఞాపికను అందుకుంది. ఇది తమ జీవితంలో మరపురాని ఘట్టమని వారు వ్యాఖ్యానించారు.

మంచు కురిసే వేళలో..


పెద్దపల్లి పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద పొగ మంచు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పొగమంచు దట్టంగా వ్యాపించింది. శనివారం తెల్లవారు జాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు దట్టమైన పొగ మంచు ఆవరించింది. పాదాచారులు, వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఏమీ కనిపించకపోవడంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేశారు.

- పెద్దపల్లి/జగిత్యాల అర్బన్/వెల్గటూర్/ఎండప ల్లి/రుద్రంగి


జగిత్యాల జిల్లా వెల్గటూర్‌లో..


రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో..


జగిత్యాల పట్టణంలో

వివాహిత ఆత్మహత్య

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సమత(21)అనే వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాల్‌పల్లి జిల్లా మల్హర్‌రావు మండలం మల్లారం గ్రామానికి చెందిన సమత ముత్తారం మండలంలోని అమరాబాద్‌కు చెందిన బిస్కుల సంతోష్‌ను రెండు సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. రెండేళ్లుగా సంతోష్ వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తుండడంతో శుక్రవారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు మొదట కరీంనగర్‌కు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. తన కూతురు మరణానికి అల్లుడు బిస్కుల సంతోష్ కారణమని మృతురాలి తల్లి చేద లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. మృతురాలికి పది నెలల కొడుకు ఉన్నాడు.

మనస్తాపంతో యువకుడు..

ముత్తారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైదంబండ గ్రామానికి చెందిన బియ్యని అజయ్(24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... అజయ్ ప్రేమించిన అమ్మాయికి వేరే పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలిసి మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు అజయ్ తండ్రి మొగిలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

వరద కాలువలో దూకి వృద్ధురాలు..

కథలాపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊట్‌పల్లికి చెందిన సుంకరి బుచ్చమ్మ (80) అనే వృద్ధురాలు వరద కాలువలో దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. బుచ్చమ్మ కొంతకాలంగా కడుపు నొప్పి, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిన బుచ్చమ్మ మళ్లీ తిరిగి రాలేదు. సమీపంలో ఉన్న పెగ్గెర్ల వరద కాలువలో శనివారం శవమై కనిపించింది. కడుపునొప్పి తీవ్రం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని తెలిపారు. మృతురాలి మేనల్లుడు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో శనివారం బైక్ అదుపుతప్పి కింద పడడంతో గ్రామానికి చెందిన ఈసంపల్లి ఆశిష్ అనే యువకుడు గాయపడ్డాడు. ఆశిష్ తన స్నేహితులను కలిసేందుకు మండల కేంద్రానికి వెళ్తుండగా వడ్డెర కాలనీ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. దీంతో తలకు, వెన్నుపూస భాగంలో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

ముస్తాఫనగర్‌లో ఇల్లు దగ్ధం

గంభీరావుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో శివంది రమేష్ ఇంట్లో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇంటి నిర్మాణం కోసం అప్పుగా తెచ్చుకున్న లక్షా 20 వేలు నగదు కాలిపోయింది. బట్టలు, పత్రాలు, ఫర్నీచర్ దగ్ధమయ్యాయి. ప్రమాద స్థలాన్ని రెవెన్యూ అధికారులు, పోలీస్‌లు పరిశీలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక నవంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో వాహన తనిఖీల్లో శనివారం మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు రెడ్డిపల్లిలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో ఆటోను తనిఖీ చేయగా మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. రేషన్ బియ్యం తరలిస్తున్న మోటం గణేశ్, నంబయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు గ్రామాల్లో తిరుగుతూ రేషన్ బియ్యాన్ని కిలోకు 12 రూపాయలు చెల్లిస్తూ కొనుగోలు చేసున్నారని పోలీసులు చెప్పారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని సుల్తానాబాద్ పరిధిలో ఉన్న కోళ్ల ఫాంలో అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారని ఎస్సై తోట తిరుపతి చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన కలప పట్టివేత


పట్టుకున్న కలపతో అధికారులు

చందుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వచేసిన కలపను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు సీసీఎస్ ఎస్ఐ రవీందర్ నాయుడు శనివారం తెలిపారు. మండలంలోని లింగంపేట గ్రామ శివారులోని పోలీస్ అమరవీరుల స్థూపం వెనుక భాగంలో టేకు కలపను డంపు చేసినట్లు సమాచారం అందిందన్నారు. అక్కడికి వెళ్లి పరిశీలించగా ఎనిమిది టేకు దుంగలు లభ్యం అయ్యామని, వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయమై బీట్ ఆఫీసర్ బాలకృష్ణ మాట్లాడుతూ పట్టుకున్న కలపను ఎల్లారెడ్డికి తరలించనున్నట్లు తెలిపారు. కలప విలువ దాదాపు ఆరు వేల వరకు ఉంటుందని వివరించారు.

చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలిగా దీపారాణి



కోరుట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణానికి చెందిన జిల్లా దీపారాణి చేనేత ఐక్య వేదిక రాష్ట్ర మహిళ విభాగం ఉపాధ్యక్షురాలిగా నియామకం అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్ శనివారం ప్రకటించినట్లు పద్మశాలి సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా దీపారాణి మాట్లాడుతూ పద్మశాలి సంక్షేమానికి, చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, పట్ట ణ అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, సంఘ సభ్యులు వాసం భూమానందం, సంఘసభ్యులకు దీపారాణి కృతజ్ఞతలు తెలిపారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

హుజూరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. బాలికల విభాగంలో కరీంనగర్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో సిరిసిల్ల జట్టు నిలిచింది. బాలుర విభాగంలో మొదటి స్థానం సిరిసిల్ల, ద్వితీయ స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, ఎంఈవో శ్రీనివాస్, శ్రీనివాస్, హెచ్‌ఎం తిరుమల, వేణుమాధవ్, రాజేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్, శ్రీనివాస్, రవికుమార్, అనిల్, సొల్లు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గణేష్‌నగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ సర్టిఫికెట్ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఆర్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ ఒక ప్రటకనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నవంబరు 15వ తేదీ లోగా దరఖాస్తులు కళాశాల తెలుగు విభాగం కన్వీనర్ డాక్టర్ బుర్ర చంద్రశేఖర్‌గౌడ్‌కు సమర్పించాలని కోరారు.

బోధన్-సిర్‌పూర్ కాగజ్‌నగర్ రైలు పునరుద్ధరణ

కరీంనగర్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా బోధన్ నుంచి కరీంనగర్ మీదుగా సిర్‌పూర్ కాగజ్‌నగర్ వరకు ప్రత్యేక రైలును శుక్రవారం నుంచి అధికారులు పునరుద్ధరించారు. గతంలో కరోనా సమయంలో రైలును నిలిపివేశారు. ప్రతి రోజు ఉదయం 4.15 గంటలకు బోధన్ నుంచి బయలుదేరి కరీంనగర్ రైల్వే స్టేషన్‌కు 7.55 గంటలకు చేరుకుంటుంది. సిర్‌పూర్ కాగజ్‌నగర్‌కు 11.55 గంటలకు చేరుకుంటుంది. తిరిగి సిర్‌పూర్ కాగజ్‌నగర్ నుంచి బయలుదేరి కరీంనగర్‌కు మధ్యాహ్నం 2.35 గంటలకు చేరుకుంటుంది. బోధన్ రైల్వేస్టేషన్‌కు సాయంత్రం 6.15 గంటలకు చేరుకుంటుంది.

రాజన్నను దర్శించుకున్న టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్

వేములవాడ కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర స్టేట్ కమిషనర్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (టీఎస్‌సీపీసీఆర్) చైర్మన్ శ్రీనివాస్‌రావు శనివారం దర్శించుకున్నారు. కుటుంబసభ్యులతో కలిసి రాజన్న ఆలయానికి వచ్చిన ఆయనకు అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు ఆశీర్వదించగా ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదాన్ని అందజేశారు.



టీఎస్‌సీపీసీఆర్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఆలయ అధికారులు



వంకాయ తోటలో కలుపు తీస్తున్న మహిళలు



సాగులో ఉన్న దొండ తోట

కూరగాయల సాగులో అతివలు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మకాలు

కూరగాయల సాగులో మహిళలు రాణిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వ్యవసాయం చేస్తూ అధిక దిగు బడులు సాధిస్తున్నారు. సేంద్రియ ఎరువులను తయా రు చేసుకుంటూ పంటలకు వాడుతున్నారు. పండిన కూరగాయాలను వారే మార్కెట్‌కు తరలించి అమ్ము తున్నారు. దీంతో దళారుల బెడద తగ్గింది. లాభ మైనా.. నష్టమైనా తామే భరిస్తున్నారు. సీజన్‌కు అను గుణంగా డిమాండ్ ఉన్న కూరగాయలు సాగు చేస్తున్నారు.



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉన్న కాలిఫ్లవర్

కోరుట్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలంలోని సర్పరాజ్‌పూర్, ఎఖీన్‌పూర్, అయిలాపూర్, నాగులపేట, వెంకటాపూర్ గ్రామాల



క్యాబేజీ తోటకు నీరు అందిస్తున్న మహిళా రైతు

మహిళలు అధిక మొత్తంలో కూరగాయలు సాగు చేస్తున్నారు. అన్ని రకాల కూరగాయలు పండిస్తూ స్థానిక పట్టణాలకు తీసుకెళ్లి తామే విక్రయిస్తున్నారు. డిమాండ్‌కు, సీజన్‌కు అనుగుణంగా వీరు కూరగా యలు, ఆకు కూరలు సాగు చేస్తారు. ప్రధానంగా కాలిఫ్లవర్, క్యాబేజీ, టమాట, తోటకూర, పాలకూర, చుక్కకూర, వంకాయ, దోస, గోరుచిక్కుడు తదితర పంటలను పండిస్తున్నారు. కూరగాయలను రసాయన ఎరువులతో కాకుండా తాము తయారు చేసుకున్న ఎరువులు వేసి సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్నారు. వీరు పండించిన పంటలను కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల వంటి పట్టణాలకు తరలించి మార్కెట్లలో విక్రయిస్తుంటారు. ప్రభుత్వం సహకరిస్తే మరింత సాగు చేస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదు. కూరగాయల విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. పండించిన కూరగాయలను విక్రయించుకోవడానికి ఆయా పట్టణాల్లో తమకు ప్రత్యేక స్థలాలను కేటాయించాలని వారు కోరుతున్నారు.

దిగుబడులు బాగున్నాయి..

- తోట లక్ష్మి, మహిళా రైతు, సర్పరాజ్‌పూర్



మాకున్న 10 గుంటల వ్యవసాయ భూమిలో క్యాలిఫ్లవర్, క్యాబేజీ, తోటకూర సాగు చేస్తున్నాము. చేతికొచ్చిన కూరగాయలను స్థానిక పట్టణాల్లో విక్రయిస్తున్నాము. ప్రజలు కూడా తాజా కూరగాయలను కొనడానికి ఆసక్తి చూపుతున్నారు.

తాజా కూరగాయలకు గిరాకీ ఉంది..

జవిడి ప్రమీల, మహిళా రైతు, (నాగులపేట)



తాజా కూరగాయలకు మార్కెట్‌లో గిరాకీ బాగుంది. మేము ఏ రోజు తెంపిన కూరగాయలను ఆ రోజు మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతాం. సేంద్రియ పద్ధతిలో పండిస్తుండడంతో ఆదరణ బాగుంది.



సేంద్రియ ఎరువును తయారు చేస్తున్న మహిళా రైతు

● సేంద్రియ ఎరువుల తయారీ

గేదే, ఆవు, మేక పేడతోపాటు కుళ్లిపోయిన పండ్లు, కూరగాయలను సేకరించి సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. అవసరం ఉన్న సమయంలో ఎరువులు వాడతారు. అవసరం ఉన్న సమయంలో వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుంటారు. కూరగాయలతోపాటు తోటల గట్లపై చామంతి, బంతి పూలు సాగు చేస్తారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే అభివృద్ధి

- ఎన్నికల వరకే రాజకీయాలు.. ఆపై ప్రజా సేవకులం
- కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- మల్యాల-కాచారం రహదారి పనులను ఎమ్మెల్యేతో కలిసి ప్రారంభించిన బండి

మల్యాల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి సాధ్యపడుతుందని ఎన్నికల వరకే రాజకీయాలు చేస్తూ ఎన్నికల తరువాత ప్రజా సేవకులుగా అభివృద్ధికి ముందుకు వెళదామని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మల్యాల మండలం మల్యాల క్రాస్ రోడ్డు నుంచి మేడిపల్లి మండలం కాచారం వరకు 11.7కిమీ మేర కేంద్ర ప్రభుత్వ సీఆర్‌ఐఎఫ్ నిధులు రూ.25కోట్లతో చేపట్టిన డబుల్‌రోడ్డు విస్తరణ పనులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని కేంద్రం నిధులు ఇచ్చినా రాష్ట్రం, కేంద్రం కలిసి చేసుకోవల్సిన అభివృద్ధి అని ప్రస్తుతం ఇది కొనసాగిద్దామన్నారు. గత ప్రభుత్వ పాలనలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించకుండా ప్రొటోకాల్ పాటించలేదని విమర్శించారు. కేంద్రం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించడమే కాకుండా పేరు ప్రఖ్యాతల కోసం అధికారులపై ఒత్తిడి చేసిందన్నారు. చాలారోజుల తరువాత మల్యాలలో పార్టీల మధ్య ప్రొటోకాల్ పాటించడం కనిపించిందని ఇది మంచి సంప్రదాయమని కాంగ్రెస్, బీజేపీ శ్రేణులు కలిసి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని ఇక ముందు ఈ ఆనవాయితీని కొనసాగిద్దామన్నారు. కేంద్ర రహదారుల మంత్రి నితిన్



గజమాలతో స్వాగతం పలుకుతున్న బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు

గడ్కరీ తెలంగాణకు అందులోనూ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గానికి అత్యధికంగా సీఆర్‌ఐఎఫ్ నిధులు మంజూరు చేశారని సంజయ్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధికి తనవంతుగా సహకరిస్తానని ప్రస్తుత రహదారి పనుల ప్రారంభ విషయంలో ఎమ్మెల్యే సహకారం ఎంతగానో ఉందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అభివృద్ధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పరం సహకారం అవసరమని, గత రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి బండి సంజయ్ నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు బొడిగే శోభ, సుద్దాల దేవయ్య, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు

● కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

రహదారి విస్తరణ పనుల కోసం వచ్చిన బండి సంజయ్, మేడిపల్లి సత్యంకు బీజేపీ, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వేర్వేరు పార్టీలు అయినప్పటికీ పరస్పరం కలిసికట్టుగా మల్యాల క్రాస్ రోడ్డు నుంచి ప్రారంభ స్థలం వరకు పాదయాత్రగా రాగ ఆయా పార్టీల శ్రేణులు, ప్రజలు పూలు చల్లుతూ తీసుకువచ్చారు. ప్రొటోకాల్ ప్రకారం పెద్ద ఎత్తున రెండు పార్టీల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సంతోషం వ్యక్తం చేశారు. ఇక ముందు కూడా అలాగే ముందుకు వెళదామని పేర్కొన్నారు. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కూడా కార్యక్రమానికి వస్తారని కాంగ్రెస్ నాయకులు పేర్కొనగా హాజరుకాలేదు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కార్యకర్తలతో చాయ్ తాగుతూ..ముచ్చటిస్తూ

కేంద్ర మంత్రి బండి సంజయ్ రహదారి పనుల శిలాఫలకం ఆవిష్కరణ తరువాత తనను కలవడానికి వచ్చిన కార్యకర్తలతో కొంత సేపు సరదాగా గడిపారు. అనంతరం కొండగట్టులో అల్పాహారం చేసి పార్టీ కార్యకర్తలతో కలిసి ముచ్చటిస్తూ టీ తాగారు. బండి సంజయ్‌ను కలవడానికి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు తరలిరాగా ఆయన ముందుకు కదలలేని పరిస్థితి నెలకొన్నది. పోలీసులు వారందరినీ అక్కడి నుంచి పంపించే ప్రయత్నాలు చేశారు. దీంతో బీజేపీ నాయకులు కొందరు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడిని కలవనీయరా.. సమస్యలు చెప్పుకో నియ్యరా అంటూ మండిపడ్డారు.

● కాగా రహదారి పనుల ప్రారంభానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంలో నూకపల్లికి బదులు మల్యాల గ్రామంగా పేర్కొనడంతో నూకపల్లి వాసులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేరు మార్చాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



బంజేరులో కంపోస్ట్ షెడ్డుని పరిశీలిస్తున్న నేషనల్ టీం సభ్యులు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలంద రూ సద్వినియోగం చేసుకోవాలని నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం లీడర్ ఎస్పీ సునీల్‌కుమార్, సభ్యులు స్నేహ నజీబ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు బంజేరులో ఉపాధిహామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, నేషనల్ సోషల్ అసిస్టెంట్ ప్రోగ్రాం, నేషనల్ రూరల్ లైవ్ లీ వుడ్ కార్యక్రమానికి సంబంధించిన పనులను శనివారం పరిశీలించారు. ఈ సంద్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా చేస్తున్న పనుల పనితీరు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు.

వీర్నపల్లి మండలం బంజేరులో గ్రామపంచా యతీ రికార్డుల మెయింటెనెన్స్, అభివృద్ధి పనుల్లో పంచాయతీ కార్యదర్శి రణధీర్ పనితీరు బాగుందన్నారు. అంతకుముందు గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమం లో ఏపీడీ నర్సింహులు, సాంకేతిక సలహాదారులు అర్షద్ పాషా, ఎంపీడీవో రఘురాం, ఏపీవో శ్రీహరి, టెక్నికల్ అసిస్టెంట్ అనిత, గంగాధర్, ఐకేపీ డీపీఎం పద్మయ్య, ఏపీఎం నర్సయ్య, సీసీలు శ్యామల, రాధ పంచాయతీ కార్యదర్శులు రణధీర్, తిరుపతి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వార్డు అధికారిపై కుక్క దాడి

వేములవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, కులగణన సర్వే విధుల్లో ఉన్న వార్డు అధికారిపై కుక్క దాడి చేసిన ఘటన శనివారం నాడు వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక రామ్ మందిర్ వీధిలోని ఓ ఇంటికి సర్వే కోసం వెళ్లిన మున్సిపల్ వార్డు అధికారి ఆంజనేయులుపై అక్కడున్న కుక్క ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో కాలుకు గాయమైన అంజనేయులును ఏరియా ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

వీర్నపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య శనివారం తెలిపారు. వీర్నపల్లి మండలం జవహర్ లాల్ నాయక్ తండాకు చెందిన అజ్మీరా తరుణ్ అనే యువకుడు వరికోత మిషన్ నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన అజ్మీరా సాగర్‌తో పలు విషయాల్లో గతం నుంచి తరుణ్‌కు విబేదాలు ఉన్నాయి. దానిని దృష్టిలో ఉంచుకొని సాగర్ అతడి స్నేహితులు దేవేందర్, రవి, శ్రీహరి వరికోత మిషన్ నడుపుతున్న తరుణ్‌ను మిషన్‌పై నుంచి దించి తీవ్రంగా గాయపర్చారు. గాయపడిన తరుణ్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. బాధితుడు తరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్ట నట్లు ఎస్‌హెచ్‌వో లచ్చయ్య తెలిపారు.

వైభవంగా కార్తీక మాసోత్సవాలు ప్రారంభం



నదిలో దీపాలు వదులుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



రాజన్న ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

గోదావరి నది వద్ద గంగా హారతి

ధర్మపురి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక మాస ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. కార్తీక మాసం పురస్కరించుకుని ఉదయం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. ఏటా నిర్వహించే విధంగా ధర్మపురి గోదావరి నది వద్ద సాయంత్రం గంగా హారతి ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి 15 రోజుల పాటు జరిగే కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్ మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు సిబ్బంది ఊరేగింపుగా గోదావరి నదికి వెళ్లారు. అనంతరం నది వద్ద శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు జరిపారు. రాత్రి వరకు గంగా హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు పౌర్ణమి వరకు నిత్యం సాయంత్రం వేళలో నిర్వహిస్తారు. గంగా హారతి కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు సీహెచ్ రమణాచార్యా, నంబి నరసింహమూర్తి పాల్గొన్నారు.

● భక్తుల రద్దీ..

ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ ఆలయాల్లో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం వరకు క్షేత్రానికి వేలాది మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించారు. అనేక మంది మహిళలు నదిలో కార్తీక దీపాలు వదిలారు. భక్తులు ఆలయాలకు చేరుకుని అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహ హోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు అంజనేయ స్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్యఅర్చకులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ నేతృ త్వంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

కొండగట్టులో కార్తీక దీపారాధన

మల్యాల (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో కార్తీకమాసం పురస్కరించుకొని దీపారాధన నిర్వహించారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి అభిషేక మండపంలో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా డోలు వాయిద్యకారుడు నీలకంఠం స్వామి వారి భజన చేశారు. ఈవో రామకృష్ణారావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, ఆలయ అర్చకులు, వేదపాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు

● వేములవాడలో ఆకట్టుకున్న కార్తీక దీపోత్సవం

వేములవాడ కల్చరల్ (ఆంధ్రజ్యోతి): ఆదిదంపతులకు ఎంతో ప్రీతికరమైన కార్తీకమాసంను పురష్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో వెలిగించిన కార్తీకదీపోత్సవం నేత్రపర్వంగా ఆకట్టుకుంది. కార్తీకమాసం మొదటి రోజు కావడంతో ఆలయంలో ఈవో వినోద్‌రెడ్డి కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన భక్తులు ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మికత ఉట్టిపడేలా దీపాలను వెలిగించారు. ఓం, ఓం నమఃశివాయ, స్వస్తిక్ రూపాల్లో భక్తులు వెలిగించిన దీపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం నుంచే భక్తులు రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో రాజన్న ఆలయ ప్రాంగాణం దీపాలకాంతుల్లో దేదీప్యమానంగా వెలుగొందింది.



కొండగట్టులో..

● ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో అర్చకులు వేదమంత్రాలతో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గండదీపంలో ఆకాశదీపాన్ని ఆలయ అర్చకులు వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నమిలికొండ రాజేశ్వర శర్మ, ఆలయ అర్చకులు, ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఖని యువకుడి ప్రతిభ

కోల్‌సిటీటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మేదరిబస్తీకి చెందిన యువకుడు మోత్కు శివ సింగరేణిలో కొలువు సాధించాడు. గత నెల 6న జరిగిన సింగరేణి ఫిట్టర్ ఉద్యోగాల పరీక్షల్లో 90 శాతం మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించి ఎంపికయ్యాడు. శివ తండ్రి శ్రీనివాస్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. తల్లి మాధవి గృహిణి. రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించడంపై పలువురు శివను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జూలపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దాపూర్ గ్రామ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌మీడియట్‌లో విద్యార్థులకు ఎకనామిక్స్ బోధించేందుకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎండి షాదుల్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ,పీజీలో 50శాతం మార్కులు కలిగి ఉండాలని, ఆసక్తిగలవారు ఈనెల 4న ఆదర్శ పాఠశాలలో నిర్వహించే డెమో క్లాసుకు హాజరుకావాలని కోరారు.

డైట్ చార్జీలు పెంపుపై విద్యార్థుల సంబరాలు

పెద్దపల్లిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోగల మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ పాఠశాల, కళాశాల విద్యార్థినులు డైట్ చార్జీల పెంపుపై సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు డైట్ చార్జీలు నలభై శాతం పెంచడంపై విద్యార్థినులు, ప్రిన్సిపాల్ మణిదీప్తి, డిప్యూటీ వార్డెన్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మీయ సన్మానం

పాలకుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా ఎన్నికైన అంతటి అన్నయ్యగౌడ్‌ను శనివారం పెద్దపల్లిలో డీసీసీ ప్రధానకార్యదర్శి సూర సమ్మయ్య అధ్యక్షతన పాలకుర్తి మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొలిపాక సుజాత, లావణ్య, నాగరాజు, తలారి శంకర్, వేల్పుల రాజ్‌కుమార్, మంచినీళ్ల బాస్కర్, డాక్టర్ తిరుపతి, చిలగాని రాజేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీదేవి ఉట్టి ప్రవేశం

ఓదెల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దీపావళి రెండో రోజు వేడుకల్లో భాగంగా కేదారేశ్వరి ఉట్టి పైకి ప్రవేశించింది. శుక్రవారం దీపావళి వేడుకలు, వైభవంగా కేదారేశ్వరి వ్రత సంకల్పం నిర్వహించగా శనివారం మహిళలంతా ఉపవాస దీక్షలు పాటిస్తూ గౌరీదేవికి మంగళ హారతులు సమర్పించిన అనంతరం ఉట్టి మీద ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు కుటుంబ సభ్యులంతా ఉపవాస దీక్షలు విరమించారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

జైపూర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్టీపీపీలోని సేవా భవన్‌లో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నిర్వహించారు. డీజీఎం పర్సనల్ ఆజ్మీర తుకారాం, సీనియర్‌పర్సనల్ అధికారి ఠాకూర్ మోహన్‌సింగ్ పౌరుల సమగ్రత ప్రతిజ్ఞ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సర్దార్‌వల్లభాయ్ పటేల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ వారాన్ని విజిలెన్స్ అవగాహన వారోత్సవాలుగా నిర్వహిస్తారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని పనిచేస్తే అవినీతికి తావుండదన్నారు. అనంతరం సేవా సమితిలో ఉచిత టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలతో పౌరుల సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో సేవా సమితి కోఆర్డినేటర్ చిలుక అరుణ, టైలరింగ్ శిక్షకురాలు రఫియా పాల్గొన్నారు.

పరిమితులు లేకుండా సన్నవడ్లకు బోనస్ చెల్లింపులు

- ఎమ్మెల్యే విజయరమణారావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి పరిమితులు లేకుండా రైతులు ఎంత మొత్తంలో సన్నవడ్లు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చినా ప్రతి క్వింటాలుకు ఐదు వందల రూపాయల చొప్పున బోనస్ చెల్లిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. రైతులు ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు, ఆందోళనలు పెట్టుకోవద్దన్నారు. సుల్తానాబాద్ మండలంలోని నర్సయ్యపల్లి, బొంతకుంటపల్లి, గర్రెపల్లి, ఐతురాజుపల్లి, దుబ్బపల్లి తదతర గ్రామాలలో శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు ఎన్ని ఇబ్బందులు, ఎంత నష్టం జరిగిందో వివరించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రతీ సీజన్‌లో వడ్ల కటింగ్ అనే పదమే వినబడదని అన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, బల్మూరి వెంకటరమణారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుక సతీష్, అబ్బయ్య గౌడ్, పులి వెంకటేశం, కల్లెపల్లి జానీ, అనుష, తిరుమల్‌రావు, తిరుపతి, బకయ్య, రాజిరెడ్డి, రాజు, రమేష్, అశోక్ రెడ్డి వెంకన్న, శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి తెలియదు..

కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతుందో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి తెలియదని, ఆయనో రాజకీయ బిక్షగాడని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడన్నారు. తన ఉనికిని చాటుకోవడానికి మాత్రమే మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలు చేశారన్నారు.

ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి బోనస్ పొందాలి..

ఓదెల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకొని మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి బోనస్ పొందాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శనివారం హరిపురం, గోపరపల్లి, ఉప్పరపల్లి, లంబాడితండా, నాంసానిపల్లి, అబ్బిడిపల్లి, కొమిర గ్రామాల్లో పొత్కపల్లి వ్యవసాయ సహకార సంఘం, ఐకేపీ ఆధ్వ ర్యంలో నిర్వహించే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎట్టి పరిస్థితుల్లో కోతలు ఉండవన్నారు. ప్రతి గింజకు మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం సన్నరకం ధాన్యాన్ని వేసుకోమని చెప్పి రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సన్న రకానికి బోనస్ ప్రకటించి రైతులకు 2లక్షల రుణమాఫీ చేశామన్నారు. నాణ్యమైన నిర్ణీత తేమతో కూడిన ధాన్యాన్ని తీసుకొచ్చే బాధ్యత రైతులదేనన్నారు. కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసిన వెంటనే రైతులు రశీదులు, ట్రక్ షీట్‌లు తీసుకోవాలని, సెంటర్‌ల ఇన్‌చార్జిలు ఎలాంటి తేడాలు లేకుండా బాధ్యతాయుతంగా కొనుగోలు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్ రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, బైరి రవిగౌడ్, మాజీ సర్పంచ్ బోంగోని రాజయ్యగౌడ్, తెలంగాణ ఉద్యమకారుడు గుండేటి ఐలయ్య, కాంగ్రెస్ నాయకులు గుండేటి మధులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కుల గణన సర్వేతో సమాజంలో మార్పు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నేతలు

పెద్దపల్లిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుల గణన సర్వేతో సమాజంలో మార్పుతో పాటు అన్ని వర్గాల ప్రజల న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. స్థానిక ఆర్కే గార్డెన్‌లో శనివారం కుల గణనపై ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ ఫలాలతోపాటు రాజకీయంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ తదితర అంశాల్లో వాటా లభిస్తుందని వివరించారు. రాహుల్‌గాంధీ ఆలోచనల మేరకు సమగ్ర కుల గణన ద్వారా ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల విధంగా కుల గణన చేసి ఎన్‌రోల్‌మెంట్ అధికారులతో ప్రతి ఇంటికి గడపకి వెళ్లి సమగ్ర సర్వేఅంశాలను నాయకులకు, కార్యకర్తలకు వివరించారు. పలు కుల సంఘాల నాయకులు, మేధావులు కుల గణనపై సలహాలను సూచనలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ అనీల్‌కుమార్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు ఈర్ల స్వరూప, మినుపాల ప్రకాష్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, రామగుండం కార్పొరేటర్లు, పెద్దపల్లి, రామగుండం, మంథని, ధర్మపురి నియోజకవర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

సుల్తానాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ అన్నారు. శనివారం ప్రారంభమైన వివరాల సేకరణ ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. పలు వార్డుల వారీగా ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ ఇళ్లకు స్టిక్కర్లు అంటించారు. ఇంటింటికి వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, మేనేజర్ అలీమొద్దీన్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 12గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భాస్కర్‌రావు తెలిపారు. శనివారం ఆయన ఎలిగేడులో సర్వే చేస్తున్న తీరును పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈనెల 6నుంచి సర్వే ద్వారా కుటుంబ వివరాలు ప్రశ్నావళి ద్వారా సేకరించడం జరుగుతుందన్నారు. 49మంది ఎన్యూమరేటర్లు, నలుగురు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వేచేసి స్టిక్కర్ ఇంటింటికి అంటించారు. శుక్రవారం 653, శనివారం 1933గృహాల సర్వే చేశామన్నారు.

ఈ కార్యక్రమంలో కార్యదర్శులు అంజలి, పాపన్న, లలిత, పున్నమయ్య, శివకుమార్, హరిబాబు, శ్రవణ్, మహేష్, కుమార్, శిరీష, సురేష్, మసీయొద్దీన్, అంగన్‌వాడీ, ఆశాలు, వీవోఏ, కారోబార్‌లు పాల్గొన్నారు.

తొలగనున్న ఇబ్బందులు..

(5వ పేజీ తరువాయి)

పెరిగినా కూడా విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీలు మాత్రం పెరగలేదు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం లభించక తంటాలు పడ్డారు. గత ఏడాది మార్చిలో అన్ని విభాగాల్లోని వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఇచ్చే మెస్ చార్జీలను 25 శాతం పెంచుతున్నామని అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో విద్యార్థులు ఎంతో సంబరపడ్డారు. కానీ ఆ ప్రకటన మాటలకు, కాగితాలకే పరిమితం అయ్యిందే తప్ప అమల్లోకి రాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పటి వరకు అంతంత మాత్రంగానే ఉన్న గురుకుల విద్యాలయాల సంఖ్యను పెంచింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు చొప్పున బీసీ గురుకులాలు, ఒక మైనార్టీ, రెండు ఎస్సీ గురుకులాల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటితో పాటు సాధారణ వసతి గృహాలు, కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో చదివే విద్యార్థులకు ఉదయం పూట టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం స్నాక్స్, పాలు, టీ అందజేసేందుకు ప్రభుత్వం మెస్ చార్జీలతో పాటు రూపాయికే కిలో బియ్యం అందజేసింది. ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలతో విద్యార్థులకు వంట చేసేందుకు గ్యాస్, కూరగాయలు, మాంసం, కోడిగుడ్లు, పండ్లు, కిరాణ సరుకులను కొనుగోలు చేసి నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనాలు, టిఫిన్లు, స్నాక్స్ పెట్టాల్సి ఉంటుంది. 3 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 950 రూపాయలు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1100 రూపాయలు, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు నెలకు 1500 రూపాయలు అందజేశారు. ఈ చార్జీలను 25 శాతానికి పెంచుతామని ప్రకటించారు. ఆ మేరకు 3 నుంచి 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1200 రూపాయలు, 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 1400 రూపాయలు, ఇంటర్, డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న విద్యార్థులకు నెలకు 1875 రూపాయలు అందజేస్తామని ప్రకటించింది. కానీ అమల్లోకి తీసుకరాలేదు. ఈ విషయమై విద్యార్థి సంఘాల నాయకులు ఎన్నో పోరాటాలు చేశారు. ఎట్టకేలకు ప్రస్తుత ప్రభుత్వం గత ప్రభుత్వం పెంచిన 25 శాతం గాకుండా 40 శాతం చార్జీలను పెంచడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీపీసీ కార్మికులకు దీపావళి కానుక

- గత వేతన ఒప్పందం ఏరియర్స్ చెల్లింపు

జ్యోతినగర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : రామగుండం ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం శుభవార్త తెలిపింది. 2022 ఆగస్టులో జరిగిన ఒప్పందం మేరకు పెరిగిన వేతనానికి సంబంధించిన ఏరియర్స్(బకాయిలు)ను 15 రోజుల్లో కార్మికులకు చెల్లించడానికి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తున్నది. బకాయిల చెల్లింపునకు సంబంధించి పీవోను జారీ చేసింది. అలాగే కాంట్రాక్టర్లకు సర్క్యులర్‌ను జారీ చేసింది. శనివారం ఐఎన్‌టీయూసీ అనుబంధ రామగుండం రీజియన్ కాంట్రాక్టు వర్కర్స్, కన్‌స్ట్రక్షన్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు బాబర్ సలీంపాషా, కార్యదర్శి భూమల్ల చందర్ ఎన్టీపీసీ హెచ్ఆర్ అధికారులు దీపక్ పాఠక్, ప్రవీణ్‌కుమార్‌తో జరిపిన చర్చల్లో యాజమాన్యం ఈమేరకు నిర్ణయం తీసుకుంది. గత 2022 ఆగస్టులో కార్మిక సంఘాలతో కుదిరిన ఒప్పందం ప్రకారం అలవెన్సులపై 1020 రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంది. అయితే రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో పని చేస్తున్న కొద్ది మందికి మాత్రమే పెరిగిన వేతనాలు అందాయి. ఈ విషయంలో రామగుండం రీజియన్ లేబర్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బాబర్ సలీం పాషా, చందర్ నాయకత్వంలో పెరిగిన వేతనాలు అందరు కార్మికులకు చెల్లించాలని ఆందోళన వ్యక్తంచేశారు. యాజమాన్యంపై తీవ్రమైన ఒత్తిడి చేయడంతో కార్మికులకు న్యాయం జరిగిందని బాబర్ సలీంపాషా అన్నారు. దీపావళి పండుగ కానుకగా కార్మికులకు ఏరియర్స్ ఇప్పిస్తున్నామని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనాన్ని సుమారు 900 మంది కాంట్రాక్టు కార్మికులకు 2022ఆగస్టు నుంచి ఏరియర్స్ రూపంలో చెల్లిస్తారని బాబర్ చెప్పారు. 15 రోజుల్లో వేతన బకాయిలు చెల్లించేందుకు అంగీకరించినందుకు ఎన్టీపీసీ ఆర్ఈడీ(హెచ్‌వోపీ) కేదార్ రంజన్‌పాండు, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, అధికారులు పాఠక్, ప్రవీణ్ కుమార్‌లకు యూనియన్ అధ్యక్షుడు బాబర్ సలీంపాషా, కార్యదర్శి భూమల్ల చందర్ కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

శ్రీరాంపూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో పనిచేసి ఆర్‌జీ-3 ఏరియాకు బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్‌ను ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ శనివారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రశేఖర్ మూడేళ్లుగా శ్రీరాంపూర్ ఓసీపీలో ఉత్పత్తి, ఉత్పాదకతకు కృషిచేశారని కొనియాడారు. వర్షాకాలంలో ఓసీపీనుంచి నీటిని తోడడానికి ప్రత్యేక పంపింగ్ విధానాన్ని ఏర్పాటుచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జిఎస్‌వోటు జీఎం గోపాల్ సింగ్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీవో ఏవీ రెడ్డి, ఆర్కే7 గ్రూపు ఏజెంట్ రాముడు, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవులు, చంద్రలింగం, మేనేజర్లు అబ్దుల్‌ఖాదిర్, తిరుపతి, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



శ్రీహితను సన్మానిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన నందిమేడారం గ్రామానికి చెందిన శ్రీహితను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కరీంనగర్‌లో సన్మానించారు. ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన సాన రాజేందర్ కుమార్తె శ్రీహిత నిర్మల్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన శ్రీహిత అత్యుత్తమ వైద్య విద్య సీటును పట్టుదలతో సాధించడం అభినందనీయమన్నారు. ఉత్తమ వైద్యురాలిగా రాణించి గ్రామానికి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మాజీ కో-అప్షన్ సభ్యుడు సలాం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్, పొనుగోటి యుగేందర్‌రావు, ఉప్పు రాజయ్య, పరంధాములు, బోయిని మధు, ముక్తి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకం..

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



రఘును సన్మానిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైందని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన పేద కుటుంబానికి చెందిన సొన్నాయిటెంకం సృజన్ తేజస్వి రఘును కలెక్టర్ సత్కరించి మెమొంటో అందజేశారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులైన సొన్నాయిటెంకం రజిత, మల్లేశం కృషి పట్టుదలను అభినందించారు. పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర కీలకమైందని కలెక్టర్ అన్నారు. వైద్య వృత్తిలో రాణించి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అట్టడుగు వర్గానికి చెందిన రఘు ఎలాంటి కోచింగ్ లేకుండా ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం బీసీ జాతికే గర్వకారణం అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ పేర్కొన్నారు. ఈ సన్మానం కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ భూతగడ్డ సంపత్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి కారుపాకల సరోజ, సత్యనారాయణ, జిల్లా రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్, తాడూరు వివేక్ నాగులమల్యాల వెంకటేశ్వర్లు, నాగులమల్యాల అశోక్, వెరీ కీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అక్టోబరులో ఆర్జీ-2 ఏరియా ఉత్పత్తి 79 శాతం..

- జీఎం సూర్యనారాయణ

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు నెలలో ఆర్జీ-2 ఏరియా 79 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు ఏరియా జీఎం సూర్యనారాయణ తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్పత్తి వివరాలను జీఎం తెలియజేశారు. అక్టోబరు నెలకు ఏరియాకు కేటాయించిన లక్ష్యం 9.17 లక్షల టన్నులు కాగా 7.25 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తితో 79 శాతంగా నిలిచినట్టు తెలిపారు. 7.98 టన్నుల బొగ్గు రవాణా జరిగినట్టు పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో గడిచిన ఏడు నెలలకు 45.29 లక్షల టన్నుల లక్షానికి 46.60 లక్షల టన్నులతో 103 శాతం ఉత్పత్తి సాధించినట్టు జీఎం పేర్కొన్నారు. ఓసీపీ-3 టార్గెట్ 8.90 లక్షల టన్నులు కాగా 7.12 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి(80%) జరిగినట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. వకీల్‌పల్లె గని లక్ష్యం 27,700 లకు 13,700 టన్నుల బొగ్గు ఉత్పత్తి(49%) జరిగిందని జీఎం తెలిపారు. ఏరియాకు నిర్దేశించిన ఓబీ తొలగింపు లక్ష్యం 59,84,000 క్యూబిక్ మీటర్లు కాగా 43,05,269 క్యూబిక్ మీటర్లతో 72% సాధించినట్టు జీఎం సూర్యనారాయణ పేర్కొన్నారు. వర్షాల కారణంగా ఓబీ తొలగింపులో వెనకబడినా రానున్న రోజుల్లో ఏరియాకు కేటాయించిన లక్ష్యాలను సాధించే దిశగా పని చేయనున్నట్టు జీఎం తెలిపారు.

అండర్‌గ్రౌండ్ అలవెన్స్ కోతను నిలిపివేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వకీల్‌పల్లె గని కార్మికులకు అండర్‌గ్రౌండ్ అలవెన్స్‌లో కోత విధించడాన్ని నిలిపవేయాలని టీబీజీకేఎస్ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ ప్రకటనలో పేర్కొన్నారు. గనికి సంబంధించి ఐదు వేలకు పైగా అండర్ గ్రౌండ్ మస్టర్లకు సంబంధించి అక్టోబర్ వేతనంలో కోత విధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ఆర్జీ-2 యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ కార్మికులకు ఆర్థిక నష్టాన్ని చేకూరుస్తున్నట్టు అయిలి శ్రీనివాస్ పేర్కొన్నారు. గత ఏడాది వివిధ పనుల నిమిత్తం యాజమాన్యమే కేటాయించిన పనులను చేసిన కార్మికులకు సంబంధించి అలవెన్స్‌లను కార్మికులకు సమాచారం ఇవ్వకుండా కోత విధించడాన్ని అన్యాయమైన విషయమని తెలిపారు. పనికిమాలిన వ్యక్తులు ఫిర్యాదు చేశారని యాజమాన్యం రికవరీ చేస్తే కార్మికుల మనోస్థైర్యం దెబ్బతినే అవకాశం ఉన్నదని తెలిపారు. యాజమాన్యం వెంటనే యూజీ అలవెన్స్‌ల రికవరీని నిలిపివేయాలని అయిలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

సీహెచ్‌పీల సామర్థ్యం 100 మిలియన్ టన్నులకు పెంచాలి

● సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

హైదరాబాద్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బొగ్గు రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్న కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్లు(సీహెచ్‌పీ) ప్రస్తుతం ఉన్న 80 మిలియన్ టన్నులుగా ఉన్న బొగ్గు రవాణా సామర్థ్యాన్ని 100 మిలియన్ టన్నులకు చేర్చే దిశగా చర్యలు చేపట్టాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సీహెచ్‌పీలు, భారీ యంత్రాల పనితీరుపై సమీక్ష జరిపారు. రానున్న రోజుల్లో సింగరేణి బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 100 మిలియన్ టన్నులకు చేరనుందన్నారు. ప్రస్తుతం కోల్‌బెల్ట్‌లో 11 భారీ సీహెచ్‌పీలు ఉన్నాయని, వీటికి అదనంగా మరో 2 సీహెచ్‌పీలు, ఒక సైడింగ్ ఏడాదిలోగా అందుబాటులోకి రానున్నాయన్నారు. 5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో రామగుండం-2 ఏరియాలో జీడీకే-6 ఒక సీహెచ్‌పీని, ఈ ఏడాది ప్రారంభం కానున్న కొత్తగూడెం వీకే ఓపెన్‌కాస్ట్ గనికి అనుబంధంగా 6 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మరో సీహెచ్‌పీని, మందమర్రి ఏరియాలో 2 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కేకే-1 రైల్వే లోడింగ్ సైడింగ్‌ని నిర్మించనున్నామని, ఈ పనులన్నీ వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తితో పాటు బొగ్గు రవాణా కూడా చాలా కీలకమని, బొగ్గు లోడింగ్ కోసం వచ్చిన రేకులను వెంటవెంటనే నింపి పంపించాలని, జాప్యం వలన పెనాల్టీలు పడే అవకాశం ఉందన్నారు. ఇక భారీయంత్రాలతో ప్రస్తుతం రోజుకు 1.6 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ మాత్రమే తొలగిస్తున్నారని, యంత్రాలను పూర్తి పనిగంటలు వినియోగించి రోజుకు కనీసం 2.00లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం భారీ యంత్రాల వినియోగం 13 నుండి 14 గంటలు మాత్రమే ఉందని, దీనిని కచ్చితంగా 20 గంటలకు పెంచాలని అప్పుడే లక్ష్యాలు సాధించగలమని చెప్పారు.

ఈ సమావేశంలో కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా విభాగాల జనరల్ మేనేజర్లు, అన్ని ఏరియాల నుంచి జనరల్ మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలో పాల్గొన్నారు.

గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు గనులు, డిపార్టుమెంట్ల వారీగా కౌన్సెలింగ్ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.నెలల తరబడి గైర్హాజరవుతున్న కార్మికులకు లేఖలద్వారా సమాచారం అందిస్తోంది. షిఫ్టులవారీగా ఏయే వృత్తుల కార్మికులు గైర్హాజరవుతున్నారు, వారి వ్యక్తిగత, పని వద్ద సమస్యలను ఆరా తీస్తున్నారు. అధికారులు వారంరోజులుగా కౌన్సెలింగ్‌ను ముమ్మరం చేశారు. వృత్తిపరమైన సమస్యలుంటే వాటి పరిష్కారానికి చొరవచూపుతున్నారు. బెల్లంపల్లి ఏరియాలో 10మందికి పైగా తరుచూ గైర్హాజరవుతున్నారు. మందమర్రిఏరియాలో 80 మంది గైర్హాజరవుతున్నారని, శ్రీరాంపూర్ ఏరియాలో 114 మందికి ఐగా గైర్హాజరవుతున్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు.

అధికారులు వీరికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. 5 ఎంవత్సరాల క్రితం ఉద్యోగంలో చేరి వంద మస్టర్లు కూడా నిండని కార్మికులపై యామాన్యం సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది.

లక్షలు వెచ్చించారు.. లక్షణంగా వదిలేశారు..

● నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు



సిద్దిపల్లె గ్రామ శివారులోని సామూహిక మరుగుదొడ్లు

కమాన్‌పూర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు నిర్వహణ లోపంతో అలంకార ప్రాయంగా మారాయి. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన శ్రీదేవసేన నేతృత్వంలో గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా మరుగుదొడ్లు లేని నిరుపేద కుటుంబాలు ఎట్టి పరిస్థితుల్లో బహిర్భూమికి వెళ్లకూడదన్న లక్ష్యంతో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. అయితే ఈ నిర్మాణాలు ఊరికి దూరంగా, అరకొర సౌకర్యాలతో నిర్మించడంతో ఉపయోగంలోకి రాకుండాపోతున్నాయి. మరుగుదొడ్లకు నీటి సదుపాయం కల్పించడంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో వినియోగంలోకి రావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్వహణను పట్టించుకోవాలి..

-నల్లవెల్లి శంకర్, కమాన్‌పూర్

ఉన్నతమైన లక్ష్యంతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను అవి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలంటే వాటి నిర్వహణను పట్టించుకుంటే అవి వాడకంలో వచ్చే అవకాశం ఉంది. నిర్వహణ పట్టించుకోకపవడంతో వృదాగా మారుతున్నాయి. వాటి నిర్వహణను పట్టించుకోవాలి.

ఉపయోగంలోకి తెస్తాం.

-జి లలిత, ఎంపీడీవో

పరిసరాల పరిశుభ్రత లక్ష్యంగా గ్రామాలకు దూరంగా సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు. మరుగుదొడ్లు లేని ప్రజలు, పనుల కోసం ఊరికి వచ్చే ప్రజలకు ఇవి ఉపయోగపడే విధంగా నిర్మించారు. సౌకర్యాల కల్పనపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపయోగంలోకి తెస్తాం.